

మహాచండీదేవి.. పాహిమాం

శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం ఆయా ఆలయాల్లో అమ్మవారు మహాచండీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. నిడమర్రు మండలం మందలపర్రులోని ఉమానీలకంఠేశ్వర పంచాయత క్షేత్రంలో ఉమాదేవి అమ్మవారు మహాచండీదేవిగా పూజలందుకొన్నారు.

\- నిడమర్రు

నేటి నుంచి పీహెచ్‌సీల్లో ఓపీ సర్వీసులు..

బహిష్కరణ

- భారీవర్షాలు, వైరల్ జ్వరాల విజృంభణ వేళ వైద్యసేవలకు విఘాతం వద్దంటూ అధికారుల సూచన
- ప్రొబేషన్ కాలంలో ఆందోళనల చట్టబద్ధతపై ఆరా
- డీఎంహెచ్‌వో టెలీకాన్ఫరెన్సుకూ వైద్యుల స్పందన కరవు
- ఇన్‌సర్వీస్ పీజీ కోటా సమస్యను పరిష్కరించాలని వైద్యుల పట్టు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పీజీ వైద్యవిద్య క్లినికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇన్ సర్వీస్ కోటా సీట్లను తగ్గించడం, పరిమితులు విధించడాన్ని నిరసించడంతో పాటు, మరికొన్ని డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యులు చేపట్టిన ఆందోళనలో భాగంగా ఆదివారం వైద్యఆరోగ్యశాఖ అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలిగారు. ఆందోళనలో భాగంగా సోమవారం నుంచి అన్ని పీహెచ్‌సీల్లో అవుట్ పేషెంట్ (ఓపీ) విధులకు హాజరు కారాదని వైద్యులు నిర్ణయించారు.

సంచార వైద్యచికిత్స, డెలివరీలు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విధులకు సంబంధించి రోజువారీ కార్యకలాపాలు, క్షేత్రస్థాయి సందర్శనలు, పరిశీలనలు, పర్యవేక్షణ తదితర వివరాలను నమోదు చేసేందుకు వాట్సాప్ గ్రూపులను అధికారికంగా నిర్వహిస్తుంటారు. ఇవన్నీ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నియంత్రణలో నమోదు చేయాల్సి ఉంటుంది. మరోవైపు భారీ వర్షాలు, తుఫాన్ల హెచ్చరికల నేపథ్యంలో అంటువ్యాధులు, వైరల్ జ్వరాలు, డయేరియా, మలేరియా వంటివి విజృంభించే సంకేతాల నేపథ్యంలో గ్రామాల్లో వైద్యసేవలకు విఘాతం కలుగకుండా పీహెచ్‌సీల వైద్యాధికారులు తమకు కేటాయించిన విధులన్నింటికీ హాజరయ్యేలా ప్రభుత్వం చర్యలను ప్రారంభించింది. ఈ క్రమంలో వైద్యసేవలను నిరాకరించడం కొనసాగితే అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టా(ఎస్మా)న్ని ప్రయోగించే విషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఇదే విషయమై క్షేత్ర స్థాయిలో పీహెచ్‌సీ ల వైద్యుల సంఘం నాయకులకు సంకేతాలు పంపినట్టు సమాచారం.

86 శాతం వైద్యులు విధుల బహిష్కరణ

వైద్యుల ఆందోళనకు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారు లు దూరంగా ఉన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించే వైద్యాధికా రులంతా కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితు లైనందున, నిబంధనల ప్రకారం వీరికి పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్ సర్వీస్ కోటా ప్రయోజనాలు వర్తించవు. ఈ కారణంగానే అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే డాక్టర్లు పీహెచ్ సీ మె డికల్ ఆఫీ సర్ల ఆందో ళనలో పా ల్గొ న డం లేదు. జిల్లాలో ఆదివారం 86 శాతం మంది వైద్యులు ఆందోళనలో పాల్గొన్నారని ఏపీ పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ జోషిమా తెలిపారు. వైద్యులకు గతేడాది ఉన్నతాధికారులిచ్చిన హామీల్లో ఒక్కటికూడా ఇంతవరకు అమలు చేయకపోవడం వల్లే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని వివరించారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పరిమితం చేస్తూ జారీచేసిన జీవో 99 ఉత్తర్వులను రద్దు చేయాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి హాజరయ్యే వైద్యులకు రూ.5వేలు అలవెన్సును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పీహెచ్‌సీల వైద్యుల ఆందోళన కార్యక్రమాలు, డిమాండ్లపై ఇప్పటికే డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతంకు నోటీసును అందజేశామని వైద్యుల సంఘం జిల్లా నాయకులు తెలిపారు.

డీఎంహెచ్‌వో టెలీకాన్ఫరెన్సుకూ వైద్యులు డుమ్మా

పీహెచ్‌సీల వైద్యులు సోమవారం నుంచి ఓపీ సేవలు నిలిపివేయనున్నట్టు ప్రకటించడంతో అప్రమత్తమైన డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం ఆదివారం సాయంత్రం టెలీకాన్ఫరెన్సు నిర్వహించగా, అతికొద్దిమంది తప్ప మిగతా వారినుంచి స్పందన కరవైంది. వర్షాలు, అంటు వ్యాధులు ప్రబలే అవకాశంఉందని, స్వచ్ఛనారీ, సంచారవైద్యసేవలకు విఘాతం కలిగించవద్దని, ఆ మేరకు వైద్యులెవ్వరూ సమ్మెలోకి వెళ్లవద్దని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఏవైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బాపట్ల, మరికొన్ని జిల్లాల్లో వైద్యులెవ్వరూ ఆందోళన/సమ్మెలో పాల్గొనడం లేదని వివరించారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని డీహెచ్, కమిషనర్లు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని హెచ్చరించారు.



ఆందోళన కార్యక్రమాల నోటీసును డీఎంహెచ్‌వోకు అందజేస్తున్న పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా నాయకులు, వైద్యాధికారులు

నేటి నుంచి ఓపీ విధులకు దూరం..

దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం నుంచి అన్ని పీహెచ్‌సీల్లో అవుట్ పేషెంట్ (ఓపీ) విధులకు హాజరు కారాదని వైద్యుల సంఘం నిర్ణయించింది. ఆ మేరకు ఓపీ సాధారణ వైద్యసేవలను బహిష్కరిస్తూనే, అత్యవసర వైద్యసేవలైన డెలివరీలు, రోడ్డుప్రమాదాలు, పాయిజనింగ్ కేసులను చూస్తారు. దీంతో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఇప్పటికే ఆన్‌లైన్ వైద్య విధులు నిలిచిపోగా, సోమవారం నుంచి కీలకమైన ఓపీ సేవలు నిలిచిపోతుండడంతో గ్రామాల్లో రోగులకు ఇబ్బందులు తప్పేలా లేవు. కాగా మంగళవారం నుంచి ముఖగుర్తింపు ఆధారిత హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్‌ఏ) యాప్ నుంచి వైదొలగాలని నిర్ణయించారు.

ప్రొబేషన్ డిక్లరేషన్, రెగ్యులరైజేషన్ కాని వైద్యులపై దృష్టి సారింపు?

ఉద్యోగ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించేందుకు అధికారులు యోచిస్తున్నట్టు సమాచారం. ఆ ప్రకారం పీహెచ్‌సీల్లో వైద్యులుగా ఉద్యోగంలో చేరినవారికి రెండేళ్లపాటు ప్రొబేషన్ పీరియడ్ ఉంటుంది. ఈ రెండేళ్ల వ్యవధిలో విధులకు అనధికారిక హాజరు, వైద్యసెలవు, వైద్యసేవల్లో నిర్లక్ష్యం వంటివి లేకుండా వున్నవారికి ప్రొబేషన్ పీరియడ్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్టుగా పరిగణించి, సర్వీసు క్రమబద్ధీకరణ నిమిత్తం ప్రతిపాదనలను జిల్లా అధికారుల ద్వారా ప్రభుత్వానికి పంపుతారు. ఆ మేరకు ఉద్యోగి సర్వీసు క్రమబద్ధీకరణ(రెగ్యులరైజేషన్)కు కనీసం మూడేళ్లు పట్టే అవకాశం ఉంటుంది. ప్రొబేషన్ కాలంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొన రాదన్న నిబంధనతోపాటు, వైద్యసేవలందించిడంలో గైర్హాజరు, అధికారిక గ్రూపుల నుంచి వైదొలగడం వంటివన్నీ వైద్యవిధుల నిర్లక్ష్యం కిందకే వస్తాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని 62 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల్లో కేవలం 12మంది సర్వీసులు మాత్రమే రెగ్యులరైజేషన్ అయ్యాయని, మిగతా వారంతా ప్రొబేషన్ పీరియడ్‌లోనే వున్న విషయాన్ని గుర్తుచేశాయి. ఆ ప్రకారం ప్రొబేషన్ కాలంలో వైద్యవిధులకు అనుమతిలేకుండా గైర్హాజరైతే ప్రభుత్వం తన పరిధిలో చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదని వివరించాయి.

ఒక్కరోజులోనే సర్టిఫికెట్!

- ఇక ఆన్‌లైన్‌లో క్యాస్ట్ సర్టిఫికెట్లు జారీ
- సుమోటోగా 3.53 లక్షల మందికి వెరిఫికేషన్
- కొత్త దరఖాస్తుదారుల ఇక్కట్లకు చెక్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు క్యాస్ట్ సర్టిఫికెట్ పొందాలంటే రోజుల వ్యవధి పట్టేది. ప్రభుత్వం వేగంగా సర్టిఫికెట్లను స్థానికంగా జారీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. కుల ధ్రువీకరణ పత్రాల కోసం కాళ్లరిగేలా తహసీల్దార్ కార్యాలయాలు, ఇతర కార్యాలయాల చుట్టూ జరిపారు. తదనంతరం ఆ డేటాను ఆర్‌ఐ, తహసీల్దార్, ఆర్డీవో వరకు లాగిన్‌లో అప్‌డేట్ చేశారు. ఈ డేటా ఆధారంగానే సచివాలయం దగ్గరే క్యాస్ట్ సర్టిఫికెట్లును తీసుకునే వెసులుబాటు కలగనుంది.



కొత్తవారికి ఉపయోగకరం...

జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లోను కుల ధ్రువీకరణ విధానానికి ప్రభుత్వం చెక్ పట్టింది. ఎవరైతే నివాసం ఉంటున్నారో.. దానికి సమీప సచివాలయంలోనే ఒక్కరోజులోనే ఈ ధ్రువపత్రం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా చాలాకాలం క్రితం గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్యాస్ట్ సర్టిఫికెట్లను ఇంకా పొందని వారి వివరాలను ఇంటింటా సేకరించారు. ఇప్పుడా ఆ డేటాతో ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ప్రతీ ఇంటింటా వీఆర్వో, వీఆర్‌ఏల వెళ్లి కుటుంబ సభ్యులు వివరాలు, వారి క్యాస్ట్ వివరాలను సుమోటోగా విచారణ పత్రాలను తీసుకుని వారి సంఖ్య అధికారులు లెక్క తేల్చారు. మూడు లక్షల 53వేల172 మంది డేటాను అప్‌డేట్ చేశారు. ఇంకా ఆరు శాతం 16 వేల మంది వివరాలను అప్‌డేట్ చేస్తే దాదాపుగా అందరి వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేసినట్లే. ఏలూరు రూరల్ మండలంలో ఇటీవల నెలరోజులు పైగా వీఆర్‌వో,వీఆర్‌ఏలు సర్వే చేసి వివరాలను సేకరించగా 3,286 మంది క్యాస్ట్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారికి స్థానిక సచివాలయాల్లో పొందేలా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఇది ప్రభుత్వం చేపట్టిన బృహత్తర పథకమని, పేదలకు మరింత త్వరితగతిన సర్టిఫికెట్ పొందే వీలుందన్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ!

గోదావరి దోబూచులాట

వేలేరుపాడు/ కుక్కునూరు/ పోలవరం, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): ముంపు మండలాల ప్రజలతో గోదావరి దోబూచులాట ఆడుతోంది. గత మూడునెలల్లో ఐదుసార్లు ఈ మండలాలను గోదావరి వరద చుట్టుముట్టింది. తాజాగా గోదావరి ఎగువన తెలంగాణలోని జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మరలా గోదావరి వరద పోటెత్తుతోంది. శనివారం సాయంత్రం 46.5 అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం కొంత తగ్గుముఖం పట్టి ఆదివారం మధ్యాహ్నానికి 41 అడుగులకు చేరుకుంది. వరద తగ్గుతుందని ఊపిరి పీల్చుకునేలోపే మరలా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి 43.5 అడుగులు నమోదు కాగా మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. 2వ ప్రమాద హెచ్చరిక 48 అడుగుల వరకు వరద పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల వేసిన మిరప తోటలు వేలేరుపాడు, కుక్కు నూరు మండలాల్లో 250 ఎకరాలకు పైగా నీట మునిగిపోయాయి. కుక్కు నూరు మండలంలో ఇప్పటికే గుండేటివాగు లోలేవెల్ కాజ్‌వే నీటమునిగే ఉంది. ఆటువైపు ఉన్న గ్రామాల ప్రజలు వయా నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటి మట్టం అనూహ్యంగా పెరిగింది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో కుక్కునూరు,వేలేరుపాడు మండలాల్లో గ్రామాలు మళ్ళీ ముంపునకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.



వేలేరుపాడు రేపాకగొమ్ము మధ్య నీటమునిగిన రహదారి



కుక్కునూరు తీరంలో ముంచుకొస్తున్న గోదావరి వరద

అరకొరగా ఉపాధి

- లక్ష్యానికి దూరంగా పీఎంఈజీపీ రుణాలు
- 161 యూనిట్లు లక్ష్యం.. గ్రౌండ్ అయ్యింది 63 యూనిట్లే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) రుణాలు అత్తెసరుగానే అందుతున్నాయి. ప్రభుత్వం ఒకవైపు ఎన్ని యూనిట్లకైనా రుణాలు ఇప్పిస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తుంటే.. అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో కుంటిసాకులతో కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. జిల్లాలో పరిశ్రమల కేంద్రం పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 161 యూనిట్లకు కేవలం 63 మాత్రమే ఉపాధి యూనిట్లు గ్రౌండింగ్ జరిగింది. ప్రధానంగా పట్టణాల్లో డీఐసీ కింద 55 యూనిట్లు ఏర్పాటు లక్ష్యం కాగా ఇందులో కేవలం 19 యూనిట్లను రూ.81.66 లక్షలతో చేపట్టగా వీటికి మార్జిన్ మనీ కింద రూ.25.90 లక్షలు మాత్రమే బ్యాంకులు విడుదల చేశాయి. ఖాదీ గ్రామీణ విలేజ్ బోర్డు కింద పల్లెల్లో ఉపాధి యూనిట్లు లక్ష్యంగా 44 యూనిట్లు కాగా ఇప్పటి వరకు కేవలం 22 యూనిట్లకు రూ.కోటి 21 లక్షల 68 వేలు మంజూరు చేయగా, దీనికి బ్యాంకులు మార్జిన్ మనీ కింద రూ.32.25 లక్షలు ఇచ్చాయి. ఖాదీ గ్రామీణ విలేజ్ కమిషన్ సెంట్రల్ గవర్నమెంట్ స్పాన్సర్ స్కీమ్ కింద 62 యూనిట్లకు కేవలం 22 యూనిట్లకు రూ.కోటి 38 లక్షల 27 వేలు మంజూరు చేయగా, దీనికి గాను బ్యాంకులు రూ.19 లక్షల 53 వేలు మార్జిన్ మనీని విడుదల చేశాయి. బ్యాంకులు విరివిగా మార్జిన్ విడుదల చేస్తేనే యూనిట్ల దారులు ఉత్పత్తి ప్రారంభించి.. తాము తీసుకున్న రుణాలను తీర్చడానికి అవకాశం ఉంటుంది. ఈ విషయంలో బ్యాంకర్లకు, పరిశ్రమల కేంద్రం అధికారుల మధ్య సమన్వయ లోపమే కారణంగా కనిపిస్తోంది.



జిల్లా పరిశ్రమల కేంద్రం

యువత స్వయం ఉపాధి యూనిట్లకు రుణం అందుకోవడం ఎండమావిగా మారింది. ప్రభుత్వం యువతను ఆదుకుంటాం.. రుణాలను విరివిగా ఇస్తామని చెబుతున్నా నూటికి నూరుశాతం రుణాలు అందడం లేదు. దీంతో యువతకు రుణాలు అందుకోవడంలో మొండిచెయ్యి ఎదురవుతోంది. జిల్లాలో యువతకు ఉపాధి మార్గం చూపే విషయంలోను బ్యాంకర్లు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి.

బ్యాంకుల వద్దే 94 దరఖాస్తులు పెండింగ్

జిల్లాలో బ్యాంకులు కుంటిసాకులతో లబ్ధిదారులకు రుణాలు అందించడంలో మోకాలడ్డుతున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. బ్యాంకుల వద్దే ఇంకా 94 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలలు గడిచిపోయాయి. మిగిలిన ఏడు నెలల వ్యవధిలో అన్ని యూనిట్లకు నిధులు మంజూరు జరుగుతుందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. కొర్రీలతో దరఖాస్తులు చాలా వరకు బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉండడంతో పరిశ్రమల అధికారులు చేతులెత్తేస్తున్నారు. దరఖాస్తుల సమర్పణ, వాటిని మంజూరు చేయించడానికి సింగిల్ విండో కింద అన్ని అనుమతులు పరిశ్రమల శాఖ ద్వారా బ్యాంకులకు వెళుతున్నప్పుడు పట్టణ, గ్రామీణ యూనిట్లతో పాటు కేంద్రం స్పాన్సర్‌షిప్ చేస్తున్న యూనిట్ల ఏర్పాటులో ఎందుకు జాప్యం చోటు చేసుకుంటుందో ఎవరికీ అర్థం కావడం లేదు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కల్పించుకుని బ్యాంకులకు తగిన మార్గ నిర్దేశం చేయాలని యువత విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫెలోషిప్‌కు 27 మంది విద్యార్థుల ఎంపిక

నూజివీడు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన యూపీఎస్సీ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు 27మంది విద్యార్థులు ఎంపికైనట్టు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల నుంచి 266 మంది పరీక్షల్లో పాల్గొనగా 27 మందిని ఫెలోషిప్‌కు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో నూజివీడు క్యాంపస్ నుంచి ఏడుగురు, ఆర్కేవ్యాలీ నుంచి తొమ్మిది మంది, ఒంగోలు క్యాంపస్ నుంచి ఏడుగురు, శ్రీకాకుళం క్యాంపస్ నుంచి నలుగురు ఉన్నారు. ఎంపికైన విద్యార్థులకు యూపీఎస్సీ పోటీ పరీక్షలకు కావాల్సిన శిక్షణ, మార్గనిర్దేశకత్వాన్ని అందించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ మధుమూర్తి, వీసీ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

భవానీ భక్తుల భద్రతకు చర్యలు : ఎస్పీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు కాలినడకన వెళ్లే భవానీ భక్తులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డు సేఫ్టీ మొబైల్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు భవానీ భక్తులు కాలినడకన జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారులపై వెళ్తున్నారు. ఈనేపథ్యంలో జిల్లాలోని భవానీ భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భవానీ భక్తులు జాతీయ రహదారిలో వెళ్లేటప్పుడు సర్వీసు రోడ్డులో ప్రయాణం కొనసాగించేలా సూచనలు ఇవ్వాలని ఆదేశించారు

చికెన్ వేస్ట్ రవాణాను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు : సీఐ

పెదపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు, పరిసర ప్రాంతాల్లోని చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు తీసుకొస్తున్న చికెన్ వేస్ట్ రవాణాను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్టు పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. ఇటువంటి చర్యల ద్వారా పర్యావరణానికి హాని కలిగించే వ్యక్తుల సమాచారం డయల్ 112 లేదా పోలీసులకు తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్పీ ప్రతాప శివకిశోర్ ఆదేశాల మేరకు గుడిపాడులో ఆదివారం రాత్రి గ్రామసభ నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మహిళా చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్, మద్యం దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదపాడు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఛిద్రమైన రహదారి.. వాహనదారుల పాట్లు

చాట్రాయి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తపూరు-బూరుగుగూడెం ఆర్‌అండ్‌బీ రహదారి(సీబీరోడ్డు) పరిధిలో చాట్రాయి- జనార్థనవరం గ్రామాల మధ్య రోడ్డు గుంతలు పడి ఛిద్రం కావడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ రోడ్డులో గుంతలు పూడ్చారు. అయితే వర్షాలకు షరా మామూలుగానే మారిందని, అధికారులుకు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రామ దేవతలకు పాల పొంగళ్లు

ఆగిరిపల్లి,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఏడో రోజు ఆదివారం భక్తులు ఆగిరిపల్లిలోని గ్రామ దేవతలకు పాల పొంగళ్లు సమర్పించారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళలు తమ ఇళ్లల్లో స్వయంగా పాలపొంగళ్లు వండి యాదవ్ బజార్ కొత్తపేటలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నుంచి బయలుదేరి, దమ్మన్న మండపం వద్ద ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ అమ్మవారికి, స్థానిక వరాహ పుష్కరిణి (మెట్ల కోనేరు) సమీపంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మకు, గంగానమ్మకు, దుగ్గిరాల బాలరావమ్మకు నైవేద్యంగా పొంగళ్లను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

పేద, మధ్యతరగతి వర్గాలకు ఆర్థికంగా మేలు

ఈవోపీఆర్డీ సత్యనారాయణ.. జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ

ముసునూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీ రేట్లు వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు ఆర్థికంగా మేలు చేకూరుతుందని ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారాయణ అన్నారు. ఆదివారం ముసునూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ నిర్వహించారు. మండల కార్యాలయంలో అంగన్‌వాడీలకు జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ఏడాదికి రూ.15 వేలు ప్రతి కుటుంబానికి ఆదా అవుతాయన్నారు. జీఎస్టీ రేట్లుపై ఒక్కొక్క శాఖ ఆధ్వరంలో 16 గ్రామాల్లో ప్రజలకు అవగహన కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ప్రజలు అవగాహన పెంచు కుని సద్వినియోగించువాలని కోరారు. ఐసీడీస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ముసునూరులో ర్యాలీ చేస్తున్న ఈవోపీఆర్డీ, అంగన్‌వాడీలు

ఘనంగా మేయర్ పుట్టిన రోజు వేడుక

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగర మేయర్ నూర్జహాన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పవర్‌పేటలో ఎస్ఎంఆర్ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడులు కేక్ కట్ చేసి మేయర్ దంపతులకు తినిపించారు. టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఎమ్మెల్యేలకిచ్చే సౌకర్యాలే ఉద్యోగులకూ ఇవ్వాలి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలకు ఇచ్చినట్టే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా సౌకర్యాలను వర్తింపజేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. కాలానుగుణంగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు తగినట్టుగా ఆరునెలలకోసారి డీఏ, ఐదేళ్లకోసారి పీఆర్సీలను ప్రకటించాలన్న విధానపరమైన నిర్ణయాలను ప్రభుత్వం విధిగా అమలు చేయాలని కోరారు. వెంటనే ఐఆర్‌ను ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

దేవాలయాలను అభివృద్ధి చేయాలి

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన ధర్మకర్తల మండలి చైర్మన్, ధర్మకర్తలు ఐక్యంగా ఉంటూ దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. స్థానిక పడమరవీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నూతనంగా నియమితులైన ధర్మకర్తల మండలి చైర్మన్ వీరమాచినేని చంద్రశేఖర్, ధర్మకర్తలు బండ వెంకట నాగ సురేశ్, బూసి కృష్ణవేణి, బండారు శ్రీసత్య మౌనిక, చాగంటి ధర్మానుజయరావు, ఏలూరు కాంతమ్మ, కాసా సూర్యవెంకట ప్రసాద్, చేకూరి యశోద, అల్లూరి అరుణలతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. తొలుత ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారోత్సవాన్ని జరిపించారు. ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఏలూరు యుడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎంఆర్డీ బలరాం, ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, యుడా మాజీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, రెడ్డి నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.


సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే చంటి

గ్రామాల అభివృద్ధిలో ఉపాధి పథకం కీలకం

పెదవేగి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో ఉపాధి పథకం కీలకమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఇలాంటి పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసే దిశగా అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని ఆయన సూచించారు. దెందులూరు మండలం ఏపీవో ఫాతిమా, 17మంది క్షేత్రసాయి సహాయకులు పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం కలిసి, పనుల పురోగతిపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6.32లక్షల పనిదినాలు, రూ.18కోట్ల వేతనాల చెల్లింపులతో దెందులూరు మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.పెదవేగి మండలం వంగూరుకు చెందిన పొనుకుమాటి జీవరత్నం అనారోగ్యానికి చికిత్స చేయించుకోవడంతో అతనికి సీఎం సహాయనిధి పథకంలో మంజూరైన చెక్కును ఎమ్మెల్యే ప్రభాకర్ అందించారు. పార్టీ నాయకులు కొనకళ్ల శివమణి, గోపిశెట్టి లక్ష్మీనారాయణ, సుంకర భాస్కరరావు, బలుసు శ్రీనివాస్ చౌదరి, లోకేశ్వర శ్రీనివాస్, పామర్తి నాగభూషణం పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ఘనంగా దసరా వేడుకలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలోని అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఏడవ రోజు కావడంతో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి పలు ఆలయాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తిసంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీ దేవి, పత్తేబాదలోని కనకదుర్గమ్మను, రేవు లింగేశ్వర ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి మహాచండీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబను గాయత్రీదేవిగా అలంకరించారు. పవరుపేట చదలవాడ వారి వీధిలో గల కంచి కామకోటి పీఠ హేలాపురి సంస్కృత వేదస్మార్త ప్రయోగ పాఠశాలలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అంబికా ఆలయం వద్ద ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ, బ్రహ్మశ్రీ తూములూరి విశ్వనాథ శాస్త్రి మహిళలతో పూజలు చేయించారు.

● దెందులూరు: మండలంలోని పలు గ్రామాల్లోని దేవీనవరాత్రుల్లో భాగంగా కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలను మహిళలు నిర్వహించారు.చల్లచింతలపూడిలో యాదవులపేటలో కనకదుర్గమ్మ ఉత్సవాల సందర్భంగా మహిళా భక్తులు పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపన్నపాలెంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని కనకదుర్గమ్మ 35వ వార్షికోత్సవం, దసరా సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారి ప్రతిమతో బ్యాండు, సన్నాయిలతో ఊరేగింపు నిర్వహించారు.

సత్యనారాయణ మూర్తికి శాంతి పురస్కారం



నిడమర్రు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర సర్వోదయ మండలి ఆధ్వర్యంలో గణపవరానికి చెందిన కాళ్ళకూరు సత్యనారాయణమూర్తిని 2025 గాంధీ శాంతి పురస్కారానికి ఎంపిక చేసినట్టు ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలియజేశారు. సత్యనారాయణ మూర్తి గత 20 సంవత్సరాలుగా మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబరు 2న గాంధీ భవనంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు.

గొప్ప మానవతావాది గుర్రం జాషువా

- బీజేపీ ప్రముఖుల ఘన నివాళి

ఏలూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా పద్య కావ్యాలతో అందరి మనస్సుల్లో చిరస్మరణీయమైన స్థానం చోటు దక్కించుకున్న కవికోకిల గుర్రం జాషువా వ్యక్తిగతంగా కూడా గొప్ప మానవతా వాది అని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పీవీ పార్థసారథి శ్లాఘించారు. నగరంలోని తంగెళ్లమూడి ఇజ్రాయిల్ పేటలోని బాబూ జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరీ(తపన), ఎమ్మెల్యే బడేటి చంటి, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీవీ పార్థసారథి మాట్లాడుతూ జాషువా జయంతిని బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం ముదావహమన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరీ మాట్లాడుతూ జాషువా తన కలం ద్వారా సమాజంలో అసమా నతలు రూపుమాపేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కలానికి కులం ఉండదని, మట్టి మాణిక్యం లాంటి వారు గుర్రం జాషువా అని కొనియాడారు. ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, వైస్ చైర్మన్ వాణిభాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శరణాల మాలతీరాణి, కొరళ సుధాకర కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు నగరపాటి సత్యనారాయణ, గాది రాంబాబు, దుర్గా నివాస్, జుంజు మోజెస్ పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆధునిక కవి పితామహుడు గుర్రం జాషువ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. సెట్‌వెల్ సీఈఓ ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాషువ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవత స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నేతర అజయ్‌బాబు మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవుల్లో విశ్వకవి సామ్రాట్‌గా జాషువ ప్రసిద్ధులని అన్నారు. గబ్బిలం అనే రచన ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. టీ.తంబి, బోమినిక్, రెడ్డిబాబు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తపన చౌదరి

మానవత ఆధ్వర్యంలో నిత్యావసరాల అందజేత

దెందులూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతుల మిన్న అనే నినాదంతో ఉత్తమ శాంతి సమాజ నిర్మాణానికి మానవత నడుంబిగించిందని తాళ్ల గోకవరం సర్పంచ్, మానవత సభ్యులు నెక్కలపూడి సురేశ్ బాబు అన్నారు. ఆదివారం చక్రయగూడెం గ్రామానికి చెందిన కేతా సంజీవరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో మానవత సంస్థ రూ.3 వేలు, పావులూరు గాంధీ రూ.2 వేలు, మోటిపల్లి శ్రీనివాసరావు వెయ్యి మొత్తం కలిపి రూ.6 వేలు, బియ్యం నిత్యవసరాలను మానవత తరఫున కరుటూరి గంగాధర ప్రసాద్, కొనకళ్ల వెంకట కృష్ణారావు, మునుగోలు రామకృష్ణంరాజు, రాజుబోయిన వెంకట దుర్గారావు, దొరరాజు శ్రీనివాసరాజు ఉన్నారు.

ఇంద్రకీలాద్రి వెళ్లే దుర్గమ్మ భక్తులకు మజ్జిగ పంపిణీ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఐసీఐఏ ఏలూరు హైమావతి క్లబ్ అధ్యక్షుడు ఎంఎల్ నరసింహరావు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు తలపెట్టారు.



విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మమ్మ అమ్మ వారిని దర్శించుకునేందుకు కాలినడకన తరలి వెళ్లే భక్తులకు ఆదివారం పెద్ద ఎత్తున మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు నరసింహరావు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పాల పొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. దసరా దేవీ శరన్నవరాత్రులు పర్వదినాలు కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గ మాలార్చన పూజలు నిర్వహించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో ఎస్.సతీశ్ కుమార్ తెలిపారు.


యర్రా ప్రగడకు సాహిత్య పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

యర్రా ప్రగడకు కేవీఎస్ సాహిత్య పురస్కారం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సాహిత్య మండలి పుల్లాబొట్ల శ్రీరామ్మూర్తి ప్రాంగణంలో ఆదివారం కేవీఎస్ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. దసరా సాహిత్యోత్సవంలో ఈ ఏడాది కళారత్న డాక్టర్ కె.వి సత్యనారాయణ సాహిత్య పురస్కారాన్ని సుప్రసిద్ధ సాహితీవేత్త, ప్రతికా రచయిత, ఎర్రాప్రగడ రామకృష్ణకు ప్రదానం చేశారు. కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ రచయితగా ఎన్నో వ్యాసాలు రాశారని, సింగపూర్, అమెరికా వంటి దేశాల్లో సాహిత్య ప్రసంగాలు, ప్రవచనాలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం నవయుగ కవి చక్రవర్తి, గుర్రం జాషువా 130వ జయంతిని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, విశ్రాంత జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు మాట్లాడారు. సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాబొట్ల పురుషోత్తమరావు, గరికపాటి కాళిదాసు, పెదపాటి రామకృష్ణ, ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'శుభవార్త కోసం ఉద్యోగుల నిరీక్షణ'

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రివర్స్ పీఆర్సీ, ఉద్యోగులకు రావలిసిన వేల కోట్లు బకాయిలు పెడితే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతిచ్చి కూటమి ప్రభుత్వం రావడానికి ఉద్యోగులు కృషి చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఐఆర్ ప్రకటిస్తారని ఆశపడ్డారు. కానీ ఇప్పటి వరకు ఐఆర్, నాలుగు పెండింగ్ డీఏలపై ఇప్పటి వరకు స్పందించకపోవడం సరికాదని, తక్షణం బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. 20 క్యాబినెట్ సమావేశాలు జరిగితే ప్రతీ క్యాబినెట్లో ఉద్యోగులకు సంబంధించి డీఏలు, ఐఆర్, పీఆర్సీ కమిషన్, పెండింగ్ బకాయిల గురించి చర్చించి శుభవార్త చెబుతారని ఉద్యోగులు ఎదురు చూశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులంతా ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని, దసరాకైనా శుభవార్త చెబుతారని ఆశిస్తున్నామన్నారు. కనీసం రెండు డీఏలు అయినా ప్రకటించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

15 మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మానవత ఏలూరు యూనిట్ నెలవారీ సమీక్షా సమావేశం ఆదివారం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో మానవత అధ్యక్షుడు ఎంఎస్ఎంఎస్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి గౌరవ అతిథిగా జీఎస్టీ ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్ నూరే చంద్రశేఖరసాయి పాల్గొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన 15మంది విద్యార్థులకు,పేదకళాకారులకు 5000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వరల్డ్ హార్ట్‌డేని పురస్కరించుకుని ఆయూష్ హాస్పిటల్స్ కార్డియాలజిస్టు డా.బొప్పన దశరథ్ గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి వైద్య సేవలందించారు. జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా సెంట్రల్ కమిటీ కన్వీనర్ పోలవరపు దేవరత్నాకరరావు, జిల్లా పూర్వ అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, ఏలూరు యూనిట్ కార్యదర్శి వూర సత్యనారాయణ, డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్‌బాబు పాల్గొన్నారు.

కొల్లేరు వాసులకు ఉపాధిని చూపండి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సుప్రీమ్‌కోర్టు తీర్పు మేరకు చెరువులు కొట్టివేస్తున్నారే కానీ, కోర్టు సూచించిన విధంగా ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడం లేదని రాష్ట్ర వడ్డీల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె కొల్లేరులో విశిష్టమైన వనరులు ఎన్నో ఉన్నాయని అవి గుర్తించి, కొల్లేరు భూసారం బట్టి సాగు చేసుకోగలిగే పంటలకు సూచించి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేలా ఒక రీసెర్చ్ సంస్థకు సిఫార్సు చేయాలని కోరుతూ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, కొల్లేరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఘంటశాల వెంకటలక్ష్మి తెలిపారు.


ఉప సభాపతి రఘురామకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటలక్ష్మి

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యుడికి ఊరట

ఉంగుటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌లో సూపర్ సిక్స్ పథకాలు, జీఎస్టీ తగ్గింపు వంటి ప్రజాదరణ కార్యక్రమాలు చేపట్టామని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఉంగుటూరు మండలం కైకరంలో ఆదివారం జరిగిన పలు శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన సమావేశంలో ఎంపీ పుట్టా మహేశ్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బీజేపీ నాయకులు శరణాల మాలతీరాణిలు ముఖ్య అతిథులుగా పాల్గొని జీఎస్టీ సంస్కరణల గురించి వివరించారు. సర్పంచ్ చెలగాల గోపి, మండల టీడీపీ అధ్యక్షులు వి.సుధీర్, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చింతల వాసు పాల్గొన్నారు.

ఎంపీడీవో సుజాతకు ఉద్యోగ విరమణ సత్కారం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగంలో చేరి 39 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ప్రజలతో మమేకమై ఉద్యోగ బాధ్యతలను నీతి నిజాయితీతో పాటు ఓపిక సహనానికి మారుపేరుగా ఎంపీడీవో సుజాత సేవలు అభినందించదగినవని, జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు, పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగార్జునసాగర్, అడిషనల్ కమిషనర్ సత్యనారాయణతో పాటు పలువురు వక్తలు కొనియాడారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న కామవరపు కోట ఎంపీడీవో వై.సుజాత పదవీ విమరణ సత్కార సభ జరిగింది. సుజాత, బాపయ్యచౌదరి దంపతులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో వివిధ హోదాల్లో 39 ఏళ్లగా సేవలను కొనియాడారు. మంచికి మారుపేరుగా విధుల్లో అంకిత భావంతో పనిచేశారన్నారు. గంట ప్రసాదరావు, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, మాజీ జడ్పీ ఏవో మాగంటి రవిబాబు, ఎంఈవో సుబ్బి, నర్సింహమూర్తి, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, పలువురు ఎంపీడీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


జ్ఞాపిక ఇస్తున్న జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ, డిప్యూటీ కమిషనర్ నాగార్జునసాగర్

మహా చండీదేవి నమోస్తుతే..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో అమ్మవారి ఆలయాల వద్ద దేవీనవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు ఆలయాల్లో అమ్మవార్లు శ్రీ మహా చండీదేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఏలూరు-సత్రంపాడులో మహాచండీదేవిగా అంబికాదేవి


రాట్నాలకుంటలో విశేష అలంకరణలో రాట్నాలమ్మవారు


పాలకొల్లులో రూ.1.40 కోట్లతో ధనలక్ష్మి అలంకారంలో వాసవీ మాత


తాడేపల్లిగూడెంలో మహాచండీదేవిగా బలుసులమ్మ


ఆచంటలో మహాచండీ దేవిగా పార్వతి దేవి


సత్రంపాడులో మహాలక్ష్మీదేవి అలంకరణలో సౌభాగ్యలక్ష్మీదేవి


పత్తేబాదలో కనకదుర్గాంబ అలంకరణలో అమ్మవారు


జంగారెడ్డిగూడెంలో మహాచండీదేవి అలంకరణలో గంగానమ్మ


నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలో రూ.6 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ


పెనుగొండలో రాజరాజేశ్వరిదేవిగా వాసవి మాత


కొయ్యలగూడెంలో కనకదుర్గమ్మ అలంకరణలో అమ్మవారు


జంగారెడ్డిగూడెంలో మహాచండీ దేవిగా వాసవీ కన్యకా పరమేశ్వరి

నేడు ఏలూరులో అంతర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఈనెల 29న వెయిట్ లిఫ్టింగ్ (ఇంటర్ డిస్ట్రిక్ట్) అండర్-14 బాలికల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏపీఎస్ ఆర్డీసీ చైర్మన్ బడేటి వెంకట్రామయ్య, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దిన్నా బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. ఏపీ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షురాలు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి అధ్యక్షతన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పోటీలు ప్రారంభిస్తారన్నారు.

మరికంటి గోపాలకృష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు

చింతలపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలోని కేఎల్ యూ యూనివర్సిటీలో జరిగిన కిసాన్ మహోత్స వం-2025లో 'కిసాన్ అంగడి' వ్యవస్థా పకుడు చింతలపూడి మండలానికి చెందిన మరికంటి గోపాలకృష్ణకు ఉత్తమ రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విస్తరణ నిపుణుల అవార్డు లభించింది. ఈ అవార్డును రాష్ట్ర ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. గత ఎనిమిదేళ్లుగా గోపాలకృష్ణ తన భూమిలో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు తనకెంతో సంతోషం కలిగించిందని, ఇది వ్యక్తిగత విజయంకాదని రైతుల ప్రోత్సాహం, ప్రకృతి వ్యవసాయంపై తనకున్న నమ్మకం ముందుకు తీసుకువెళ్లిందన్నారు.


ఎమ్మెల్సీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న గోపాలకృష్ణ




ఎలుబూడి విజయ్‌కుమార్, షేక్ షాహిన్‌లను అభినందిస్తున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

నాడు కార్యదర్శులు నేడు టీచర్లు

- డీఎస్సీకి ఎంపికైన కార్యదర్శులను అభినందించిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి, ఎంపీడీవో శ్రీనివాస్

ఇరగవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగాలకు ఎంపికైన ఇరగవరం మండల పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఎ.శ్రీనివాసు అభినందించారు. పొదలాడ గ్రామ సెక్రటరీ ఎలుబూడి విజయ్ కుమార్, కె.కుముదవల్లి గ్రామ సెక్రటరీ షేక్ షాహిన్ 2019లో ప్రభుత్వ ఉద్యో గంలో చేరి ఆరేళ్లపాటు విధులు నిర్వర్తిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిపై ఇష్టంతో దొరికిన సమయంలోనే చదువుకుంటూ వారి ఆశలను నెరవేర్చుకున్నారు. వీరిద్దరిని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు. ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

టీచర్ కావాలనే ఆశతో : ఎలుబూడి విజయ్‌కుమార్

మా స్వగ్రామం తణుకు మండలం దువ్వ, తల్లిదండ్రులు వ్యవసాయదారులు, 2018 సచివాలయ గ్రేడ్-5 సెక్రటరీగా ఉద్యోగం సాధించా. వీరవాసరం మండలం రాయకుదురు, అత్తిలి మండలం కేఎస్ గట్టు గ్రామాలలో విధులు నిర్వర్తించి ప్రస్తుతం ఇరగవరం మడలం పొదలాడ గ్రామంలో విధులు నిర్వ ర్తిస్తున్నా. టీచర్ ఉద్యోగంపై ఆసక్తితో డీఎస్సీ కోసం ప్రయత్నం చేస్తూ టీజీటీ (సైన్స్)గా ఉద్యోగం పొందా. విద్యార్థులకు నా వంతు సహాయ సహకారాలను అందిస్తా.

డీఎస్సీ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశా : షేక్ షాహిన్

నాకు చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తి అటే ఎంతో ఇష్టం. నా కలలను నిజం చేసుకోవడానికి డీఎస్సీ పరీక్ష కోసం ఎన్నో ఏళ్ల నుంచి వేచి చూశా. నా కష్టానికి ఫలితంగా 2025 మెగా డీఎస్సీలో టీచర్‌గా ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ విజయవానికి నా భర్త, తల్లిదండ్రుల కృషి చాలా ఉంది. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించేందకుఉ కృషి చేస్తా.

వైభవంగా దుర్గామాత గ్రామోత్సవం

- పెదపాడులో లక్ష గాజులు, సారె సమర్పణ
- ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

పెదపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల్లో భాగంగా పెదపాడు శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో దుర్గామాత గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి లక్ష గాజుల నివేదనలో భాగంగా తొలుత గాజుల పూజ, హోమం, కుంకుమార్చనలు నిర్వహించి పెద్ద సంఖ్యలో మహిళలు, మాలధారణ చేసిన భవానీలు గాజులు, అమ్మవారికి సారెతో గ్రామోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామోత్సవం ముందు చిన్నారుల కోలాటాలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. పెదపాడు పాలకేంద్రం సెంటర్ నుంచి విఘ్నేశ్వరస్వామి దేవాలయం మీదుగా శివాలయం చేరుకుంది. అనంతరం దుర్గామాతకు సారె, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నౌలూరి దీపు, శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



పెదపాడులో దుర్గమ్మ గ్రామోత్సవం గాజులు, సారెతో భవానీలు, మహిళలు

జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు మధురశ్రీ

కొయ్యలగూడెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం వీఎస్ఎన్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని మధురశ్రీ జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైనట్టు కళాశాల కరస్పాండెంట్ వీఎస్‌ఎన్.స్వామి తెలిపారు. ఈనెల 28న ఒంగోలులో బీఆర్ ఒలింపియాడ్‌లో ఏర్పాటు చేసిన గేమ్స్‌లో సెపక్‌తక్రా గేమ్‌లో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం కైవసం చేసుకుంది. ఈమేరకు విద్యార్థినిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు కరస్పాండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు


పోటీలకు ఎంపికైన వీఎస్ఎన్ విద్యార్థిని మధురశ్రీ

స్థానిక వస్తువులను కొనుగోలు చెయ్యాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కోసం స్థానికంగా తయారయ్యే వస్తువులనే కొనుగోలు చేయాలనే ప్రధాని పిలుపుని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలో జిల్లా బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కేఎస్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక స్క్రీన్‌పైన ప్రధాని మోదీ 126వ మన్-కి-బాత్ కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రసారం ద్వారా ఆయన బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఆత్మనిర్భర్ భారత్ స్వదేశీ సంకల్ప పత్రాన్ని చదువుతూ ప్రతిజ్ఞ చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి, పేరిచర్ల సుభాష్‌రాజు, అయినంపూడి శ్రీదేవి, నార్ని తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిదండ్రులపై కోపగించుకున్న ఒక యువకుడు పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరులోని వంగాయగూడెంకు చెందిన పడమటి వీరబాబు(27), అతని తండ్రి సత్తిబాబు కలిసి సాయినగర్‌లో ఓ వ్యక్తికి చెందిన ఐదు ఎకరాల వరి పొలాలన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈనెల 25న సత్తిబాబు అతడి కుమారుడు పురుగుల మందును పొలానికి కొట్టారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత.. ఎంతో కష్టపడ్డాడని మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని తండ్రిని కోరాడు. తల్లిదండ్రులు మందలించడంతో కోపగించుకున్న యువకుడు వెంటనే పొలం వెళ్లి పురుగుల మందు తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ, గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ ఎస్‌ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆదివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

ముసునూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిల్లబోయినపల్లిలోని పెద్ద చెరువు వద్దకు గ్రామానికి చెందిన భీమడోలు జయరాజు (64) ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. స్థానికు లు చెరువులో గాలింపు చర్యలు చేపట్టి వృద్ధుడి మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బేగ్ తెలిపారు.

దంపతులకు గాయాలు

భీమవరం క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ ఎస్‌ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ళ మండలం పెద అమిరం గ్రామానికి చెందిన తాడి నాగరాజు ఆదివారం భార్యభర్తలు కలిసి పని నిమిత్తం భీమవరం వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో సరిగ్గా అడ్డవంతెన వద్దకు వెళ్ళేసరికి వెనుక నుంచి వస్తున్న కారు వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రెహ్మాన్ తెలిపారు.


న్యాయ సలహా కేంద్రాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీదేవి

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలును ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో పరిశుభ్రత, ఖైదీలకు అందుతున్న మెను, ఆరోగ్యం, ఇతర సదుపాయాలను రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఏ కేసుల్లో అరెస్టు అయి వచ్చారన్న విషయాన్ని ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సలహా కేంద్రం ద్వారా సేవలందిస్తామని వివరించారు. ఆమె వెంట న్యాయమూర్తి రత్నప్రసాద్, సబ్‌జైలు అధికారి అప్పారావు, న్యాయవాదులు శిరిష, చిట్టి పద్మ, శ్యామ్‌కుమార్ ఉన్నారు.


మేనేజింగ్ పార్టనర్ శ్రీహరిరాజును సన్మానిస్తున్న జనసేన నాయకులు

'ఓజీ' విజయోత్సవం

ఆకివీడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓజీ సినిమా ఆకివీడులో మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో కలక్షన్స్ సాధించడంతో ఆదివారం జనసేనాలు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. మూడు రోజుల్లో రూ.18,32,462లు వసూల్ చేసిందని ఆకివీడు జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు తెలిపారు. ఇప్పటి వరకు ఏ సినిమా ఇంతటి కలక్షన్లు సాధించలేదని తెలిపారు. స్థానిక విజయా థియేటర్ దగ్గర కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. థియేటర్ మేనేజింగ్ పార్టనర్ శ్రీహరిరాజును జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. జనసేన కౌన్సిలర్ గోపిశెట్టి వెంకట సత్యవతి, జనసేన మండలాధ్యక్షుడు బాలాజీ, కన్వీనర్ దారపురెడ్డి కన్నబాబు, చిరంజీవి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో విస్తృతంగా పోలీస్ తనిఖీలు

- మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రోబరీ గ్యాంగుల ప్రవేశంపై అప్రమత్తం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ గ్యాంగులు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి నేరాలకు పాల్పడడంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ యంత్రాంగం లాడ్జీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లను తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు వారి సిబ్బంది కలిసి లాడ్జీలను తనిఖీ చేస్తూ అనుమానాస్పద వ్యక్తులను ఆరా తీస్తున్నారు. మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రోబరీ గ్యాంగులు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి విశాఖపట్టణం నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వారు దోపిడీలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఈ గ్యాంగులు లాడ్జీలలో, బస్టాండ్, రైల్వే స్టేషన్లలు తక్కువ ధర లాడ్జీలలో ఉంటున్నారనే సమాచారం ఉండడంతో ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృతంగా లాడ్జీల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈగ్యాంగులు హిందీలో మాట్లాడుతున్నారని పగటి వేళ రెక్కీ నిర్వహించి రాత్రి వేళ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. దోపిడీలకు పాల్పడుతున్న ఈ గ్యాంగ్ ఫొటోలను ఇప్పటికే దేవరపల్లి పోలీసులు విడుదల చేశారు. వారి ఆచూకీ చెబితే రూ.50 వేలు పారితోషికం ఇస్తామని ప్రకటించారు.


ఏలూరు లాడ్జిలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ కోటేశ్వరరావు


రహదారి ప్రారంభించిన ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే పత్సమట్ల

ఫత్తేపురం- తోకలపల్లి రోడ్డు ప్రారంభం

నిడమర్రు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ అన్నారు. ఆదివారం నిడమర్రు మండలంలో ఫత్తేపురం నుంచి తోకలపల్లి వరకు సుమారు కోటి రూపాయల అంచ నాతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బీజేపీ నాయకురాలు శరణాల మాలతీరాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆక్వా సమస్యలను ప్రస్తావించగా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. గ్రామ ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, సొసైటీ అధ్యక్షుడు పొత్తూరి నరసింహరాజు, కందులపాటి సత్యనారాయణ, గోలి పుండరీకాక్షుడు, అడవికొలను వాటర్ డీసీ చైర్మన్ బేతు శివరామారావు, వంగా రఘు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, చింతపాటి బాసిరాజు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

గాంధీ స్కూలు ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

ఏలూరు అర్బన్/ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తోన్న శ్రీగాంధీ ఆంధ్రజాతీయ మహావిద్యాలయం నూతన ట్రస్టు బోర్డు కార్యవర్గంతో ఎమ్మెల్యే బడేటి చంటి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ట్రస్టుబోర్డు కాలపరిమితి రెండేళ్లు. బోర్డు చైర్మన్‌గా జె.అంజిబాబు, పాలకవర్గ సభ్యులుగా పి.అమ్మాజీ, ఆర్.మోహన్ బోసియే, ఎ.కృష్ణ మోహన్, కె.రామమోహనరావు, వై.వెంకటలక్ష్మి, ఎస్.బలేరాముడు, పి.దేవ కుమారి, ఎం.వి.రామ నరసింహశర్మ, వి.దేవిభారతి, ఎస్.రాజ్‌కుమార్‌లను నియమించిన విషయం విదితమే. కార్యక్రమంలో ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, ఎంఆర్డీ బలరామ్, ఎస్ఎంఆర్ పెదబాబు, స్కూలు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వంకినేని భానుప్రకాశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, విక్రమ్ కిషోర్

స్వదేశీ పరిశ్రమల స్థాపనపై మోదీ దృష్టి

ఏలూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశంపై అమెరికా విధిస్తున్న అధిక సుంకాల నేపథ్యంలో స్వదేశీ పరిశ్రమల అభివృద్ధి పరచడం ద్వారా దేశాన్ని బలోపేతం చేయడానికి ప్రధాని మోదీ దృష్టి సారించాలని కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి అన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 11 ఏళ్లలో రాష్ట్రానికి ప్రతీ ఏటా భారీగా నిధులను కేటాయిస్తోందని, రాష్ట్ర పథకాలకు మోదీ ఆశీస్సులు ఉండటం శుభ పరిణామమన్నారు. బీజేపీ బలోపేతం కోసం ప్రతీ జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలను పార్టీ చేపడుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25 లక్షల మంది పార్టీ సభ్యులుగా ఉన్నారన్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుప ఏ గారపాటి సీతారామాంజనేయ చౌదరి(తపన), పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, శరణాల మాలతీరాణి పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

పెదపాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవాలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం సోమవారం ఉదయం 11.31 గంటలకు దేవాలయం వద్ద జరుగుతుందని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి. తారకేశ్వర రావు తెలిపారు. ఆలయ చైర్మన్‌గా వేమూరి శ్రీనివాస రావుతో పాటుగా పాలకవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ప్రజాప్రతి నిధులతో పాటు ఆలయ అధికారులు, దేవాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.


వేమూరి శ్రీనివాసరావు

మానవత ఆధ్వర్యంలో నిత్యావసరాల అందజేత

దెందులూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రార్థించే పెదవులకన్నా సహాయం చేసే చేతుల మిన్న అనే నినాదంతో ఉత్తమ శాంతి సమాజ నిర్మాణానికి మానవత నడుంబిగించిందని తాళ్ల గోకవరం సర్పంచ్, మానవత సభ్యులు నెక్కలపూడి సురేశ్ బాబు అన్నారు. ఆదివారం చక్రయగూడెం గ్రామానికి చెందిన కేతా సంజీవ రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో భాధపడుతుండటంతో మానవత సంస్థ రూ.3 వేలు, పావులూరు గాంధీ రూ.2 వేలు, మోటిపల్లి శ్రీనివాసరావు వెయ్యి మొత్తం కలిపి రూ.6 వేలు, బియ్యం నిత్యవసరాలను అందజేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పాల పొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. దసరా దేవీ శరన్నవరాత్రులు పర్వదినాలు కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారా యణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణ య్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు.

లారీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

కుక్కునూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండల లారీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా గంజి రాంబాబు, కార్యదర్శిగా మహ్మద్ వలిభాషలు ఎన్నికయ్యారు. సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ సమక్షంలో ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో వీ.నాగరాజు, శ్రీను, మహేశ్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సేవా సంఘం సభ్యులు

భగత్‌సింగ్ ఆశయాలు నెరవేర్చాలి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విప్లవ నేత భగత్‌సింగ్ ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని భగత్ సింగ్ సేవా సంఘం అధ్యక్షుడు చెరుకూరి శ్రీధర్ అన్నారు. ఆదివారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘ సభ్యులు చిత్తపూరి దుర్గేశ్, తెలగారపు సాయి, తోట సతీశ్, కోనేటి చంటి, సుబ్బు, తానిగడప సుమలత, రాము, శ్రీను, కన్నా కృష్ణ పాల్గొన్నారు.

● కుక్కునూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ముందుగా చిత్ర పటానికి పూలమాలలు సమర్పించిన నివాళులర్పించారు. బ్రిటీష్ పాలకుల కబంధ హస్తాల నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడంలో భగత్‌సింగ్ చేసిన ప్రాణత్యాగం, సిద్ధాంతాలు, ఎందరికో స్ఫూరిదాయమని సీపీఐ మండల కార్య దర్శి కొన్నే లక్ష్మయ్య అన్నారు. సారంగి శౌర్య, ప్రేమ్ సాగర్, లక్కీ, మహేశ్, రాము, ప్రదీప్‌లు పాల్గొన్నారు.

పారేపల్లితో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ, సూపర్-6 పథకాల గురించి తనతో ఫోన్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారని పోలవరం మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ పథకాల వల్ల మంచి స్పందన రావడంతో సీనియర్ టీడీపీ నేతలతో ముఖ్యమంత్రి ఫోన్లో మాట్లాడుతున్నారని దానిలో భాగంగానే తనకు ఫోన్ చేసినట్లు తెలిపారు. ఈ పథకాల పట్ల మరింత ప్రచారం చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

భీమడోలు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీ పుట్టా మహేశ్ అన్నారు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాల కాలనీలో 45 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, బీసీ కాలనీలో ఉపాధి నిధులు 70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ మహేశ్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



యర్రా ప్రగడకు సాహిత్య పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

యర్రా ప్రగడకు కేవీఎస్ సాహిత్య పురస్కారం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సాహిత్య మండలి పుల్లాబొట్ల శ్రీరామ్మూర్తి ప్రాంగణంలో ఆదివారం కేవీఎస్ సా హిత్య పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. దసరా సాహి త్యోత్సవంలో ఈ ఏడాది కళారత్న డాక్టర్ కె.వి సత్యనారాయణ సాహిత్య పురస్కారాన్ని సుప్రసిద్ధ సాహితీవేత్త, ప్రతికా రచయిత, ఎర్రాప్రగడ రామకృష్ణకు ప్రదానం చేశారు. కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ రచ యితగా ఎన్నో వ్యాసాలు రాశారని, సింగపూర్, అమెరికా వంటి దేశాల్లో సాహిత్య ప్రసంగాలు, ప్రవచనాలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంద న్నారు. అనంతరం నవయుగ కవి చక్రవర్తి, గుర్రం జాషువా 130వ జయంతిని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, విశ్రాంత జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు మాట్లాడారు. సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాబొట్ల పురుషోత్తమరావు, గరికపాటి కాళిదాసు, పెదపాటి రామకృష్ణ, ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు

కామవరపుకోట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆదివారం అమ్మవారిని కాత్యాయినీదేవిగా అలంకరించి దర్శనమిచ్చారు.బొర్రంపాలెం అడ్డరోడ్డులోని అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులతో కుంకుమ పూజలు చేయించారు. పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు(దుర్గబాబు), సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో సామూహిక కుంకుమ పూజలు, పారాయణలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పీఠంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దీంతో పీఠం ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది.

కనకదుర్గమ్మ నిజరూప దర్శనం

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న కనకదుర్గమ్మ ఆదివారం నిజరూపంలో కనకదుర్గమ్మ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్దఎత్తున అమ్మవార్ని దర్శించుకున్నారు. మండలంలోని కన్నాపురం, బయ్యన్నగూడెం, రాజవరం, యర్రంపేట, పొంగుటూరు, తదితర గ్రామాల్లో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



కె.కోటలో అమ్మవారి ఊరేగింపు.. కొయ్యలగూడెంలో దుర్గమ్మ

గొప్ప మానవతావాది గుర్రం జాషువా



సమావేశంలో మాట్లాడుతున్న తపన చౌదరి

- బీజేపీ ప్రముఖుల ఘన నివాళి

ఏలూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా పద్య కావ్యాలతో అందరి మనస్సుల్లో చిరస్మరణీయమైన స్థానం చోటు దక్కించుకున్న కవికోకిల గుర్రం జాషువా వ్యక్తిగతంగా కూడా గొప్ప మానవతావాది అని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పీవీ పార్థసారధి శ్లాఘించారు. నగరంలోని తంగెళ్లమూడి ఇజ్రాయిల్ పేటలోని బాబూ జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరీ(తపన),ఎమ్మెల్యే బడేటి చంటి, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీవీ పార్థసారధి మాట్లాడుతూ జాషువా జయంతిని బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం ముదావహమన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరీ మాట్లాడుతూ జాషువా తన కలం ద్వారా సమాజంలో అసమా నతలు రూపుమాపేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కళానికి కులం ఉండదని, మట్టి మాణిక్యం లాంటి వారు గుర్రం జాషువా అని కొనియాడారు. ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, వైస్ చైర్మన్ వాణిభాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శరణాల మాలతీరాణి, కొరళ సుధాకర కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు నగరపాటి సత్యనారాయణ, గాది రాంబాబు, దుర్గా నివాస్, జుంజు మోజెస్ పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆధునిక కవి పితామహుడు గుర్రం జాషువ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. సెట్‌వెల్ సీఈఒ ప్రభా కర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాషువ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నేతర అజయ్ బాబు మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవుల్లో విశ్వకవి సామ్రాట్‌గా జాషువ ప్రసిద్ధులని అన్నారు. గబ్బి లం అనే రచన ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. టి.తంబి, బోమినిక్, రెడ్డిబాబు పాల్గొన్నారు.

● గుర్రం జాషువాకు చిన్నారుల ఘన నివాళి

లింగపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కులమత అసమానతలు లేని సమ సమాజం కోసం కలంతో పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని ధర్మాజీగూడెం గ్రంథాలయాధికారి సి.హెచ్.వెంకటరమణ అన్నారు. మండటలంలోని ధర్మాజీగూడెం గ్రంథాలయంలో మహాకవి గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సమాజ సంస్కరణకు అక్షరాన్ని ఆయుధంగా ఎంచుకుని అసమానతలపై గళమెత్తిన గొప్పవ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని అన్నారు. ముందుగా చిన్నారులు, గ్రంథాలయ కమిటీ సభ్యులతో కలిసి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు

● పెదపాడు: తెలుగు కవులలో గుర్తింపు పొందిన గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని పెదపాడు శాఖా గ్రంథాలయంలో జయంతిని ఆదివారం నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి దుగ్గి పోగు జాన్ బాబు ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మూఢాచారాలపై జాషువా రచనలు, నిర్మూలనకు చేసిన కృషిని ఈ సందర్భం గా విద్యార్థులకు వివరించారు.

గ్రామాల అభివృద్ధిలో ఉపాధి పథకం కీలకం

పెదవేగి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో ఉపాధి పథకం కీలకమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఇలాంటి పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసే దిశగా అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని ఆయన సూచించారు. దెందులూరు మండలం ఏపీవో ఫాతిమా, 17మంది క్షేత్ర స్థాయి సహాయకులు పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం కలిసి, పనుల పురోగతిపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 6.32లక్షల పనిదినాలు, రూ.18కోట్ల వేతనాల చెల్లింపులతో దెందులూరు మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పెదవేగి మండలం వంగూరుకు చెందిన పొనుకుమాటి జీవరత్నం అనారోగ్యానికి చికిత్స చేయించుకోవడంతో అతనికి సీఎం సహాయనిధి పథకంలో మంజూరైన చెక్కును ఎమ్మెల్యే ప్రభాకర్ అందించారు. పార్టీ నాయకులు కొనకళ్ల శివమణి, గోపిశెట్టి లక్ష్మీనారాయణ, సుంకర భాస్కరరావు, బలుసు శ్రీనివాస్ చౌదరి, లోకేశ్వర శ్రీనివాస్, పామర్తి నాగభూషణం పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

సత్యనారాయణ మూర్తికి శాంతి పురస్కారం



నిడమర్రు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ 156వ జయంతిని పుర స్కరించుకుని రాష్ట్ర సర్వోదయ మండలి ఆధ్వర్యంలో గణపవరానికి చెందిన కాళ్ళకూరు సత్యనారాయణమూర్తిని 2025 గాంధీ శాంతి పురస్కారానికి ఎంపిక చేసినట్టు ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలియజేశారు. సత్యనారాయణ మూర్తి గత 20 సంవత్సరాలుగా మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబరు 2న గాంధీ భవనంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న మహిళ

చిన్నారి వైద్యానికి సహకరిస్తానని ఎంపీ హామీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణం ఎనిమిదవ వార్డుకు చెందిన గొడ్ల వినీత కుమార్తె శాన్వి(ఆరునెలలు) గుండె సంబంధిత వైద్యానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన గొడ్ల వినీత కుమార్తె గుండెకు రంధ్రం ఉన్నట్టు వైద్యులు చెప్పారన్నారు. ఈ విషయం ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్షా 75 వేలు మంజూరు చేయించారు. మిగతా డబ్బుల కోసం శాన్వి తల్లి శనివారం జంగారెడ్డిగూడెం వచ్చిన ఎంపీ మహేశ్ వద్దకు తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు.

'స్వదేశీ పరిశ్రమల స్థాపనపై మోదీ ఫోకస్'

ఏలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంపై అమెరికా విధిస్తున్న అధిక సుంకాల నేపథ్యంలో స్వదేశీ పరిశ్రమల అభివృద్ధి పరచడం ద్వారా దేశాన్ని బలోపేతం చేయడానికి ప్రధాని మోదీ దృష్టి సారించాలని కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి అన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 11 ఏళ్లలో రాష్ట్రానికి ప్రతీ ఏటా భారీగా నిధులను కేటాయి స్తోందని, రాష్ట్ర పథకాలకు మోదీ ఆశీస్సులు ఉండటం శుభ పరిణామమన్నారు. బీజేపీ బలోపేతం కోసం ప్రతీ జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలను పార్టీ చేపడుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25 లక్షల మంది పార్టీ సభ్యులుగా ఉన్నారన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయక సామాజిక వర్గం

ఏడవ రోజుకు చేరిన ఆందోళన

కామవరపుకోట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో 1500 మంది కలిగిన నాయక సామాజిక వర్గం గతంలో ఇచ్చిన మాదిరిగా ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఆందోళన ఆదివారం ఏడవ రోజుకు చేరింది. వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. మోకాళ్ళపై నిలుచుని వెంటనే సర్టిఫికెట్లు మంజూరు చేయాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. గోధుమ మధు, నల్లమోతుల సత్యనారాయణ, బోగ్యం నారాయణ, పిక్కిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో నాయక సామాజిక వర్గానికి చెందిన మహిళలు, వృద్ధులు, యువతీ యువకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

జాతీయ స్థాయి పోటీలకు మధురశ్రీ ఎంపిక

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం వీఎస్ఎన్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని మధురశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వీఎస్ఎన్ స్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 28న ఒంగోలులో బీఆర్ ఒలింపియాడ్‌లో ఏర్పాటు చేసిన గేమ్స్‌లో సెపక్‌తక్రా గేమ్‌లో రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం కైవసం చేసుకున్నారు. దీంతో విద్యార్థినిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు.



మధురశ్రీని అభినందిస్తున్న దృశ్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అడపా నాగలక్ష్మి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): మెగా మెడికల్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అడపా నాగలక్ష్మి, కే9 వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ శివశంకర్ కోరారు. ఆదివారం మండలంలోని రామానుజపురం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కే9 కాపునేస్తం ఆధ్వర్యంలో ఇటువంటి మెగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని కే9 సంస్థ అధ్యక్షుడు తొమ్మిదేళ్ల శ్రీనివాస్, కార్యదర్శి శీలం కృష్ణంరాజు తెలిపారు. పలువురికి వైద్య చికిత్సలు నిర్వహించారు.

ఎంపీడీవో సుజాతకు ఉద్యోగ విరమణ సత్కారం



ఏలూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగంలో చేరి 39 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ప్రజలతో మమేకమై ఉద్యోగ బాధ్యతలను నీతి నిజాయితీతో పాటు ఓపిక సహనానికి మారుపేరుగా ఎంపీడీవో సుజాత సేవలు అభినందించదగినవని, జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు, పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగార్జునసాగర్, అడిషనల్ కమిషనర్ సత్యనారాయణతో పాటు పలువురు వక్తలు కొనియాడారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న కామవరపు కోట ఎంపీడీవో వై.సుజాత పదవీ విమరణ సత్కార సభ జరిగింది. సుజాత, బాపయ్యచౌదరి దంపతులను సత్క రించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో వివిధ హోదాల్లో 39 ఏళ్లుగా సేవలను కొనియాడారు. మంచికి మారుపేరుగా విధుల్లో అంకిత భావంతో పనిచేశా రన్నారు. గంట ప్రసాదరావు, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, మాజీ జడ్పీ ఏవో మాగంటి రవిబాబు, ఎంఈవో సుబ్బి, నర్సింహమూర్తి, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, పలువురు ఎంపీడీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మహా చండీ నమోస్తుతే..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో అమ్మవారి ఆలయాల వద్ద దేవీనవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు ఆలయాల్లో అమ్మవార్లు శ్రీ మహా చండీదేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమను చల్లగా చూడాలని.. తమ కోర్కెలు నెరవేర్చాలని భక్తులు అమ్మవార్లను ప్రార్థించారు. పలు చోట్ల కుంకుమ పూజలు జరిగాయి.

ఏలూరు-సత్రంపాడులో మహాచండీదేవిగా అంబికాదేవి



రాట్నాలకుంటలో విశేష అలంకరణలో రాట్నాలమ్మవారు



సత్రంపాడులో మహాలక్ష్మీదేవి అలంకరణలో సౌభాగ్యలక్ష్మీదేవి



పత్తేబాదలో కనకదుర్గాంబ అలంకరణలో అమ్మవారు



జంగారెడ్డిగూడెంలో మహాచండీదేవి అలంకరణలో గంగానమ్మ

నేడు ఏలూరులో ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఈనెల 29న వెయిట్ లిఫ్టింగ్ (ఇంటర్ డిస్ట్రిక్ట్) అండర్-14 బాలికల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏపీఎస్ ఆర్డీసీ ఛైర్మన్ బడేటి వెంకట్రామయ్య, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దిన్నా బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. ఏపీ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షురాలు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి అధ్యక్షతన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పోటీలు ప్రారంభిస్తారన్నారు.



ఎమ్మెల్సీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న గోపాలకృష్ణ

మరికంటి గోపాలకృష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు

చింతలపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలోని కేఎల్ యూ యూనివర్సిటీలో జరిగిన కిసాన్ మహోత్స వం-2025లో 'కిసాన్ అంగడి' వ్యవస్థా పకుడు చింతలపూడి మండలానికి చెందిన మరికంటి గోపాలకృష్ణకు ఉత్తమ రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విస్తరణ నిపుణుల అవార్డు లభించింది. ఈ అవార్డును రాష్ట్ర ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. గత ఎనిమిదేళ్లుగా గోపాలకృష్ణ తన భూమిలో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు తనకెంతో సంతోషం కలిగించిందని, ఇది వ్యక్తిగత విజయంకాదని రైతుల ప్రోత్సాహం, ప్రకృతి వ్యవసాయంపై తనకున్న నమ్మకం ముందుకు తీసుకువెళ్లిందన్నారు.

జంగారెడ్డిగూడేన్ని అప్‌గ్రేడ్ చేయాలి



ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్‌కు వినతి పత్రమిస్తున్న టీడీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు అమరావతి లో ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్‌కు విన్నవించారు. గత కొన్నేళ్లుగా గ్రేడ్ -1 కు సంబంధించిన ఫైల్ మున్సిపల్ శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. నగర పంచాయతీ నుంచి గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా సిబ్బందిని పెంచలేదన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జంగారెడ్డిగూడెం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్ ఉన్నారు.

ఆర్చరీ పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక

చింతలపూడి, సెప్టెంబరు 28(ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అంతర్ యూనివర్సిటీల ఆర్చరీ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాస రావు తెలిపారు. గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో జరిగిన పోటీల్లో రెండు విభాగాల్లో ఇద్దరు విద్యార్థినులు, ఇద్దరు విద్యార్థులు యూనివర్సిటీ ఆర్చరీ జట్టుకు ఎంపికయ్యారని, ఎంపికైన యూనివర్సిటీ జట్టు పంజాబ్‌లో జరిగే ఆలిండియా అంతర యూనివర్సిటీల ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అంజద్ అలీ తెలిపారు.



స్వర్ణ కంకణం తొడుగుతున్న బాబూమోహన్

కనకలింగ బ్రహ్మంకు శిల్పకళాబ్రహ్మ అవార్డు

చింతలపూడి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సందర్భంగా జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాదులో ఆదివారం జరిగింది. ఈ ఉత్సవంలో చింతలపూడికి చెందిన శిల్పకళాకారుడు మందుగుల కనకలింగ వీరబ్రహ్మంకు శిల్పకళాబ్రహ్మ బిరుదును, చేతికి స్వర్ణ కంకణాన్ని సినీనటుడు బాబూమోహన్ చేతుల మీద అందుకుని ఈ కంకణం తొడిగారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ తాను పద్మశ్రీ అవార్డు వచ్చే వరకు ఈ నైపుణ్యాన్ని పెంచుకుంటానని అది తన కోరికని పేర్కొన్నారు. చింతలపూడి జిల్లాలోని కళాభిమానులు ఆయన చేపట్టిన శిల్పకళా నైపుణ్యాలను, అందుకున్న అవార్డుకు అభినందనలు తెలిపారు.



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న తపన చౌదరి

స్వదేశీ వస్తువులనే వాడండి

మన్‌కీబాత్‌లో మోదీ పిలుపు - ఆచరించాలన్న తపన చౌదరి

లింగపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్ భారత్ కోసం స్వదేశీ వస్తువుల వినియోగం పెంచాలని ప్రధాని మోదీ పిలుపును ప్రతి ఒక్కరూ ఆచరించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయచౌదరి(తపన చౌదరి) కోరారు. ప్రధాని మోదీ 126వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో బీజేపీ కార్యకర్త నివాసంలో గారపాటి సీతారామాంజనేయచౌదరి స్థానిక బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. గారపాటి సీతా రామాంజనేయ చౌదరి మాట్లాడుతూ దేశంలో యువతకు, స్వదేశీ వ్యవస్థలకు, సంస్కృతి, ప్రగతి సేవలకు సంబంధించి ప్రధాని కీలక సందేశాన్నిచ్చారని ముఖ్యంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా దేశాభిమానాన్ని ఉద్ధరించు కోవాలని, స్థానికంగా తయారైన ఖాదీ, ఇతర ఉత్పత్తులనే కొనుగోలు చెయ్యాలని, ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. స్థానిక ఉత్పత్తుల తయారీ, విక్రయాలను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. భారతదేశం ఆత్మ నిర్భర్ భారత్ దిశగా పయనించేందుకు మన్‌కీబాత్ కార్యక్రమం ప్రతిఒక్కరినీ ప్రేరేపిస్తుంద న్నారు. బీజేపీ ఏలూరు పార్ల మెంట్ కన్వీనర్ కె.కృష్ణప్రసాద్, స్థానిక బీజేపీ నాయకుల పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
కైకలూరు, నూజివీడు
7 www.andhrajyothy.com ● సోమవారం 29 సెప్టెంబరు 2025

గుర్రం జాషువాకు ఘన నివాళి

చాట్రాయి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తన కవిత్వంతో సమాజంలో మార్పు కోసం గుర్రం జాషువా పోరాడారని వక్తలు పేర్కొన్నారు. చనుబండలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు జి. శ్రీనివాసరావు, నెక్కలపు వెంకటేశ్వరరావు, బజ్జూరి గోపీ కృష్ణ, బసవ ప్రసాద్, కొత్తగుండ్ల రమేష్, ఎ. హేమంత్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ నివారణపై అవగాహన ఉండాలి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రేబిస్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆగిరిపల్లి ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. ప్రపంచ రేబిస్ వ్యతిరేక దినం సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రం వద్ద ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుక్క, కోతి, పిల్లి కరిచిన వెంటనే గాయాన్ని ముందుగా సబ్బుతో కడిగిన తరువాత ఆరోగ్య కేంద్రం వద్ద యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలన్నారు.

సకల సేవా కేంద్రాలుగా సహకార సంఘాలు

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను సకల సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చెప్పారు. వాడవల్లిలో రూ.37 లక్షల నిధులతో నిర్మించిన సహకార సంఘ కార్యాలయ నూతన భవనం, గోడౌన్ ఆదివారం ఆయన ప్రారంభించారు. సంఘ అధ్యక్షుడు ముమ్మడిశెట్టి గోవర్ధనరావు అధ్యక్షతన జరిగిన సభలో కామినేని మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రూ.1.70 లక్షల తక్కువ వడ్డీ రుణాలను మహిళలకు, రైతులకు రైతు నేస్తం, కర్షక మిత్ర రుణాల చెక్కులను ఎమ్మెల్యే కామినేనితో పాటు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి అందజేశారు. సహకార బ్యాంకు ముదినేపల్లి బ్రాంచి మేనేజర్ రమేష్, కేడీసీసీ బ్యాంక్ సివిల్ ఇంజనీర్ వై.శ్రీనివాస రావు, సంఘ సీఈవో నాగమునీంద్రరావు, డైరెక్టర్లు, సర్పంచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించా లని ఎమ్మెల్యేను గ్రామస్తులు, జనసేన నాయకులు కోరగా రక్షిత మంచినీటి పథకం నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



వాడవల్లిలో పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తలైన్ల నిర్మాణం కోసం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కైకలూరు మండలం పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

నేడు అప్పడాపై రైతులకు అవగాహన

కైకలూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు సబ్సిడీపై విద్యుత్‌ను పొందేందుకు అప్పడా రిజిస్ట్రేషన్ కోసం రైతులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో సాయంత్రం 4 గంటలకు రెవెన్యూ, మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తారని ఆక్వా రైతులు పాల్గొనాలని కోరారు.